క్లుప్తంగా

గ్రామాల్లో డీఎల్‌పీఓ పర్యటన



పోలిరెడ్డిపాళెం సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ

దొరవారిసత్రం: అక్కరపాక, పోలిరెడ్డిపాళెం, తనియాలి, బూదూరు గ్రామాల్లో మంగళవారం డీఎల్‌పీఓ రవీంద్రబాబు పర్యటించారు. పారిశుద్ధ్య పనులను, సచివాలయాల్లో రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వీధుల్లో, తాగునీటి కొళాయిలు వద్ద బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ పనులు చేయాలని ఆయా ప్రాంతాల్లోని పంచాయతీ కార్యదర్శులను డీఎల్‌పీఓ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష



హాజరైన పంచాయతీ కార్యదర్శులు

సైదాపురం: పంచాయతీల అభివృద్ధిపై డీపీఓ సుస్మితరెడ్డి అధ్యక్షతన వెబెక్స్ మీటింగ్‌ను మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీల్లో నిర్వహించాల్సిన యాప్‌ల వివరాలను వెంటనే నమోదు చేయాలన్నారు. అలాగే పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ఆమె ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

దొరవారిసత్రం: వేణుంబాకంలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈసందర్భంగా శిబిరంలో షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ–2 కాంచన

గూడూరురూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎంఈఓ–2 కాంచన సూచించారు. రూరల్ పరిధిలోని తుంగపాళెం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణతో పాటు విద్యార్థుల ప్రగతి, హాజరు శాతం పరిశీలించి బడిబయట ఉన్న పిల్లలను ఎంత మందిని బడిలో చేర్పించారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూసి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. ఆమె వెంట హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం సురక్షితం



గర్భిణులకు వైద్యపరీక్షలు

రాపూరు: ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం సురక్షితమని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు రాజకుమారి అన్నారు. రాపూరు మండలం వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం గర్భవతులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు వైద్యపరీక్షలు, రక్తపరీక్షలు నిర్వహించామని, ఐరన్ తక్కువ ఉన్నవారికి మాత్రలు అందించామన్నారు. గర్భవతులు ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకుని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

కండలేరులో 6.321 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.321 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్యాన్సర్ పరీక్షలకు స్పందన

చంద్రగిరి: క్యాన్సర్‌కు సంబంధించిన పలు రకాల ఉచిత స్క్రీనింగ్ పరీక్షలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు కొటాల, చంద్రగిరి పీహెచ్‌సీ మెడికల్ అధికారులు డాక్టర్ ప్రియాంక, కుసుమకుమారి తెలిపారు. మంగళవారం ఐతేపల్లి, శానంబట్ల గ్రామాల పరిధిలో టీటీడీ స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సులో క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్విమ్స్ పింక్ బస్సు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బ్రెస్ట్, ఓరల్, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలతో పాటు మరి కొన్ని పరీక్షలను నిర్వహిస్తామన్నారు.

ఊరు తరిమేస్తోంది!

- వేప గింజలు, వరి పొలాల్లో వరిగ ఏరుకుంటున్న వృద్ధులు
- జీవనోపాధి కోసం పట్టణాలకు వలసబాట
- నిర్మానుష్యంగా మారుతున్న గిరిజన కాలనీలు



వరి పొలాల్లో నేలరాలిన గింజలు ఏరుకుంటున్న గిరిజన దంపతులు (ఫైల్)

పెళ్లకూరు: స్వగ్రామాల్లో జీవనోపాధి లేక జానెడు కడుపు నింపుకునేందుకు తోబుట్టువులను, ఉన్న ఊరిని వదిలి పలు గ్రామాల్లోని గిరిజనులు ఉపాధి కోసం పట్టణాలకు వలసబాట పడుతున్నారు. పేద కుటుంబాలకు చెందిన గిరిజనులు సొంత ఊళ్లో ఉపాధి లేక తమ పిల్లలు సహా కుటుంబాలను వదిలి, ఊరు విడిచి వలసలు వెళుతున్నారు. 2011లో మండలంలో 4,134గా ఉన్న గిరిజన జనాభా 2021 నాటికి 4,882 మాత్రమే. అంటే పదేళ్లలో కేవలం 748 మాత్రమే పెరగడం విశేషం. ప్రతిఏటా గిరిజన కాలనీ నుంచి జనాభా ఇతర ప్రాంతాలకు తరలిపోవడం గమనార్హం. తాళ్వాయిపాడు, పాలచ్చూరు, అనకవోలు, కానూరు, రోసనూరు, పునబాక, నెలబల్లి గ్రామాల్లో ఎక్కువ మంది గిరిజనులు స్వగ్రామాల్లో ఉపాధి లేక జీవనోపాధి కోసం వలసబాట పడుతున్నారు. రోసనూరు, కప్పగుంటకండ్రిగ, కొత్తూరు, జూమానుగుంట గిరిజన కాలనీల్లోని ఎక్కువ మంది గిరిజనులు ఆయా గ్రామాల్లో భూస్వాములకు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొందరు గిరిజనులు భూస్వాముల వద్ద బండ కష్టం చేయలేక, తీసుకున్న రుణం చెల్లించలేక కొన్ని కుటుంబాలు రహస్యంగా ఊరు వదిలి పోతున్నారు. అలాగే కొందరు గిరిజనులు నాయుడుపేట, శ్రీకాళహస్తి, చెన్నై ప్రాంతాల్లో ఇటుక బట్టీల్లో పనులు చేసుకునేందుకు తమ పిల్లలు సహా వెళ్లిపోవడంతో ఇంటి వద్ద వయస్సు మీరిన వృద్ధులు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. ముఖ్యంగా నాయుడుపేటకు సమీపంలోని తాళ్వాయిపాడు గ్రామం గిరిజన కాలనీలో 290 మంది నివసిస్తున్నారు. అయితే స్థానిక టీడీపీ నాయకులు కొందరు గిరిజన కాలనీపై కన్నేయడం వల్ల అక్కడ నివాసాలు వదులుకొని ఇతర ప్రాంతాలకు గిరిజనులు తరలిపోతున్నారు. పట్టణానికి దగ్గరగా తాళ్వాయిపాడు వున్నందున ఇక్కడ ఇళ్ల స్థలాలకు గిరాకీ పెరిగింది. దీతో ఇక్కడి కొంతమంది టీడీపీ నాయకులు గిరిజనులు ఉంటున్న ఇళ్లకు రూ.లక్ష చెల్లించి ఇంటితోపాటు స్థలాన్ని స్వాధీనం చేసుకొని పెద్దపెద్ద నివాసాలను, దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే రోసనూరు గ్రామం గిరిజన కాలనీ సమీపంలో కొందరు టీడీపీ నేతలు జామాయిల్ తోటను ఏపుగా పెంచడంతో విషసర్పాలు, అడవి పందుల తాకిడికి అక్కడి గిరిజనులు వలసబాట పడుతున్నారు. ఇలా మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనులు జీవనోపాధి లేక కొందరు, పెత్తందారులు, టీడీపీ నేతల ఒత్తిళ్లకు మరికొందరు గ్రామం వదిలి వలసలు వెళుతున్నట్లు విమర్శలున్నాయి.

తిండికి తిప్పలు..

ప్రభుత్వం గిరిజనులను ఆదుకోవడానికి ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రగల్భాలు చెప్పడం తప్ప ఆచరణకు నోచుకోకపోవడంతో పలు గ్రామాల్లోని గిరిజనులు తిండికి తిప్పలు పడుతున్నారు. చెంబడిపాళెం, పాలచ్చూరు, కానూరు, రోసనూరు, కప్పగుంటకండ్రిగ గ్రామాల్లో గిరిజనులు తిండి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వయస్సు పైబడడంతో కూలీ పనులు చేయలేని పరిస్థితిలో పిడికెడు మెతుకుల కోసం అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. కన్నబిడ్డలు సైతం ఆయా ప్రాంతాల్లో ఉపాధి లేకపోవడం వల్ల వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వదిలి పట్టణాలకు వలసలు వెళుతున్నారు. ఎక్కువ మంది వృద్ధులకు పింఛన్, రేషన్ సరుకులు అందకపోవడంతో పూట గడవడం కష్టంగా మారింది. దీంతో ఖరీఫ్ సీజన్ వరికోత పొలాల్లోకి కాళ్లీడ్చుకుంటూ వెళ్లి నేలరాలిన గింజల కోసం రోజంతా శ్రమిస్తున్నారు. ఎలుకల బొరియలను తవ్వి అక్కడ దొరికే గింజలను సేకరించుకొని వాటితో కడుపు నింపుకుంటున్నారు. కంప్యూటర్ కాలంలో ఊహకందని విధంగా అభివృద్ధి చెందుతున్నామంటూ చెప్పుకుంటున్న సమాజంలో జానడు పొట్ట నింపుకోవడానికి ఇక్కడ గిరిజన వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోతలు పూర్తి అయిన వరి పొలాల్లో రోజంతా పరిగ గింజలు ఏరుకోవడం వరి యంత్రం కింద రాలిన గింజలను పోగు చేసుకోవడం వాటితో ఇక్కడ గిరిజన వృద్ధులు జీవనం సాగించడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వృద్ధాప్యంలో ఉన్న గిరిజనులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జూమానుగుంట రోడ్డులో వేప గింజలు ఏరుకుంటున్న గిరిజన మహిళ



కుటుంబ సభ్యులు పట్టణాలకు వలస వెళ్లడంతో ఇంటి వద్ద ఒంటరిగా వృద్ధురాలు

తిండికి ఇబ్బందులు పడుతున్నాం



వయస్సు పైబడడం వల్ల వ్యవసాయ కూలీ పనులు చేసే శక్తి లేదు. వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి పగిర ఏరుకుంటూ, దొరికిన గింజలతో పూట గడుపుకుంటున్నాం. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలి.

–పోలయ్య, కానూరు గిరిజన కాలనీ

పనుల కోసం వలస వెళ్లారు



ఎన్నో ఏళ్లుగా కాలనీలో ఉంటున్న గిరిజనులకు ఎలాంటి ఆస్తులు లేవు. ఉన్నంత కాలం యజమానుల వద్ద సేద్యం పనులు చేయాలి. ఎంత కాలం కష్టపడి పనులు చేసినా అప్పులు తీర లేదని బెదిరిస్తూ పనులు చేయించుకుంటారు. దీంతో ఎక్కువ మంది ఊరు వదిలి వలస వెళ్లిపోయారు.

– శ్రీనివాసులు, పాలచ్చూరు గిరిజన కాలనీ

పరిశీలించి చర్యలు చేపడతాం

గిరిజన కాలనీల్లో ఉంటున్న ప్రజలకు జీవనోపాధి విషయంతో పాటు పెత్తందారుల ఒత్తిడి, నాయకుల ఆగడాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తాం. గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతాం.

– చంద్రముని, ఆర్డీఓ సూళ్లూరుపేట

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ గురుకుల కళాశాల (బాలుర)లో గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శారదాబాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన నియామకానికి అవకాశం ఉందని, ఈ మేరకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎంపీఈడీ అర్హత గల ధ్రువీకరణ పత్రాలతో నేడు బుధవారం సాయంత్రం 4గంటలలోపు కళాశాలలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 8712625075 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు మండల మీట్

వెంకటగిరిరూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో చేయాల్సిన మౌలిక సదుపాయాలు, తాగునీరు, అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని పేర్కొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



అవగాహన కల్పిస్తున్న ట్రైక్ ఇన్‌స్పెక్టర్

చిల్లకూరు: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడకుంటే ప్రాణాలకే ముప్పని ట్రైక్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ద్విచక్రవాహన చోదకులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్‌తో పాటు లైసెన్స్‌లేని ఏడుగురికి అపరాధం విధించారు. ఆయన వెంట రవాణా శాఖ సిబ్బంది ఉన్నారు.

రైతుల సమస్యలు పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న వ్యవసాయ ఏడీఏ

సూళ్లూరుపేట రూరల్: అర్హులుగా ఉండి పీఎం కిసాన్ పథకం అందని రైతుల పలు సమస్యలను పరిష్కరించినట్లు వ్యవసాయ ఏడీఏ అనిత తెలిపారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పీఎం కిసాన్ అందని రైతులకు ప్రత్యేక పరిష్కార వేదికను నిర్వహించారు. 128 రైతుల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ల్యాండ్ లింకేజీ సమస్య 28 మంది రైతులు, ఈకేవైసీ కాకపోవడం 18 మంది, లబ్ధిదారులు అందుబాటులో లేక నిధులు ఆపుదల 48 మంది, రాష్ట్ర ప్రభుత్వం ఆపిన 31 మంది రైతుల సమస్యలను అధికారులు గుర్తించి అర్జీలను స్వీకరించామన్నారు. ముఖ్యంగా 12 మంది రైతులకు పీఎం కిసాన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసి ఆమోదించామని తెలిపారు. దీనిపై సమస్యలుంటే రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సహాయ సిబ్బంది, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. ఏఓలు కవిత, కాంచన, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

నిధుల స్వాహాపై విచారణ చేపట్టండి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

డక్కిలి: డక్కిలి వైకేపీ కార్యాలయంలో సీసీలు, ఏపీఎంలు కలసి మహిళలు పొదుపు చేసిన సొమ్ము, ప్రభుత్వ పథకాల కింద విడుదలైన రూ.1.3 కోట్ల నిధులను స్వాహా చేసినట్టు ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గద్దల మునెయ్య మంగళవారం డక్కిలి ఎంపీడీఓ నీలమాధవి, తహసీల్దార్ శ్రీనివాసులు, స్థానిక పోలీసుస్టేషన్‌లో, వెంకటగిరి వైకేపీ ఏరియా కో–ఆర్డినేటర్లకు వినతి పత్రం అందజేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

మహిళల భద్రతపై చర్యలు తీసుకోండి

తిరుపతి కల్చరల్: మహిళలకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా పార్టీ కన్వీనర్ టి.రాజేశ్వరి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. రెండేళ్ల నుంచి 80 ఏళ్ల మహిళల వరకు అభద్రతా భావంతో బతుకులు సాగించే పరిస్థితి ఏర్పడిందన్నారు. చిన్నారులపై, మహిళలపై అత్యాచారాలు జరుగుతుండడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం మహిళ భద్రత కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలని, అత్యాచారాల నివారణపై ప్రత్యేక దృష్టించి సారించాలని కోరారు. అలాగే బ్యాంకుల్లో దాచుకొని ఖాతాదారుల సొమ్ములకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం దృష్టించి సారించి ఖాతాదారులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ మహిళా పార్టీ ప్రతినిధులు విజయలక్ష్మి, పూర్ణిమ, దేవి, శ్రీవాణి, అనసూయ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించండి

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తోందని, ముఖ్యంగా జీఓ 117, 3, 4, 5వ తరగతుల విలీనం, ఇతర సమస్యలతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రతి హైస్కూల్‌కు హెడ్‌మాస్టర్, పీడీ పోస్టులను కేటాయించాలని కోరారు. హైస్కూల్ ప్లస్‌లో రెగ్యులర్ ప్రాతిపదికన లెక్చరర్లను, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని తెలిపారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, డీఈఓ పూల్‌లో ఉన్న పండిట్ల అప్‌గ్రెడేషన్‌కు చర్యలు తీసుకోవాలని, అన్ని పాఠశాలల్లో తెలుగు మీడియంను కొనసాగించాలని సూచించారు. విద్యాశాఖ మంత్రి అన్ని ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకుని విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

మాంసాహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న వెటర్నరీ వర్సిటీ అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామీణ మహిళలకు మాంసాహార ఉత్పత్తుల తయారీపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెటర్నరీ వర్సిటీ డీన్ వీరబ్రహ్మయ్య, పశువైద్య కళాశాల అసోషియేట్ డీన్ జగపతిరామయ్య ముఖ్యఅతిథులుగా విచ్చేసి, విలువ చేకూరిత మాంసాహార ఉత్పత్తుల తయారీలో నైపుణ్యాన్ని పెంపొందించుకునే సూచనలు వివరించారు.

సెక్యూరిటీకి జీతాలు అందేనా?

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో విధులు నిర్వహించే సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వారికి మూడు, నాలుగు నెలలకు ఒకసారి జీతాల చెల్లింపు జరుగుతోంది. ప్రస్తుతం నాలుగు నెలలకు జీతాలు రావాల్సి ఉంది. ఎన్నికలకు మునుపే కాంట్రాక్టర్‌కు గడువు ముగిసింది. అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో టెండర్లు పిలవడానికి వీలు లేక పొడిగిస్తున్నారు. పదిరోజుల క్రితం టెండర్లు కూడా జరిగాయి. అవి ఏ దశలో ఉన్నాయో కూడా తెలియదు. ఒంగోలుకు చెందిన ఏజెన్సీ ద్వారా జీతాలు చెల్లించాల్సి ఉంది. సంస్థ నిర్వాహకుడు శ్రీకాళహస్తికి రావడంలేదు. వచ్చినా బిల్లులు పెట్టడంలేదు. అధికారులు కూడా అడగడం లేదు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది జీతాలు అందక కుటుంబ పోషణ సాగక అవస్థలు పడుతున్నారు. తమ బాధలు ఎవరు తీరుస్తారు శివయ్య అంటూ వారు వాపోతున్నారు.

గ్రూపు సభ్యులకు రుణాలు



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం

చిల్లకూరు: పొదుపు గ్రూపు సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తే వాటిని సక్రమంగా వినియోగించుకునేలా లీడర్లు చూడాలని సంఘమిత్ర ఏపీఎం గున్నయ్య సూచించారు. మండలంలోని సంఘమిత్ర కార్యాలయంలో మంగళవారం పొదుపు గ్రూపు లీడర్లు, సంఘ బృందం అధ్యక్షులకు అవగాహన కార్యక్రమంతోపాటు ఒక రోజు శిక్షణ అందించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న గ్రూపు సభ్యులకు సంఘమిత్ర ద్వారా అన్ని రకాల రుణాలను బ్యాంకుల ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అనంతరం బ్యాంకుల ద్వారా సభ్యులు తీసుకున్న రుణాల వివరాలను కంప్యూటర్‌లో నమోదుపై అవగాహన కల్పించారు.

నెల్లూరు రీజియన్‌కు 110 బస్సులు



కార్మికులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం

రాపూరు: నెల్లూరు ఆర్టీసీ రీజియన్‌కు 110 కొత్త బస్సులు రానున్నట్లు ఆర్‌ఎం వెంకటరత్నం తెలిపారు. రాపూరు ఆర్టీసీ డిపోను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు అవార్డులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అవసరం మేరకు కొత్త బస్సులు ఆయా డిపోలకు అందిస్తామన్నారు. అలాగే మరో 14 బస్సులు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. నెల్లూరు జిల్లాలో అన్ని డిపోలకంటే రాపూరు డిపో లాభాలబాటలో ఉందన్నారు. ఈ సందర్భంగా రాపూరు డిపోలో అత్యధిక కలెక్షన్ తీసుకొచ్చిన ముగ్గురు కండక్టర్లకు, డీజిల్ పొదుపు చేసిన ముగ్గురు డ్రైవర్లకు, ఒక మెకానిక్‌కు ఆర్‌ఎం చేతులమీదుగా నగదు బహుమతి అందజేశారు. డిపో మేనేజర్ అనిల్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి నవరాత్రి వేడుకలు



అలంకరణలో అమ్మవారు, శ్రీచక్ర యంత్ర మహామేరువు

నాయుడుపేటటౌన్: పట్టణంలో వ్యూహలక్ష్మి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆలయం వద్ద వారాహి అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారితోపాటు శ్రీచక్ర యంత్ర మహా మేరువుకు పంచామృత అభిషేకాలు, సామూహిక అమ్మవారి మూలమంత్ర, లక్ష్మీ సహస్ర నామ కుంకుమ పూజలు వేడుకగా జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



లక్ష్మీ సహస్రనామ కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అవినీతికి చోటులేకుండా ఇసుక సరఫరా



మావిళ్లపాడు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లోడింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీఓ

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

దొరవారిసత్రం: అవినీతికి చోటులేకుండా ఇసుక సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. మంగళవారం మావిళ్లపాడు సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్‌ను ఎమ్మెల్యే హాజరై సరఫరాను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఇసుక సరఫరా విషయంలో నూతన విధివిధాలను తీసుకొచ్చామన్నారు. దీనివల్ల అందరికి మేలు జరుగుతుందన్నారు. ఇసుక అక్రమంగా తరలిపోకుండా సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ చంద్రముని, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ శివరాజు, సీఐలు జగన్మోహన్‌రావు, సోమయ్య, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులనాయుడు, నేతలు ఉదయ్‌కుమార్, విజయ్, మనోహర్‌రెడ్డి, పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

పెళ్లకూరు: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఎంపీడీఓ అన్నపూర్ణరావు, డాక్టర్ సుజాత, డాక్టర్ ప్రవీణ, ఎంఈఓ శంకరయ్య పాల్గొన్నారు.

అర్హులకు ఉచితంగా ఇసుక పంపిణీ

వెంకటగిరిరూరల్: అర్హులైన పేదలందరికీ ఉచితంగా ఇసుక పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని మొగళ్లగుంటలో ప్రభుత్వ ఇసుక రీచ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రవాణా చార్జీలు నిమిత్తం రూ.590 లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ సాంబశివరావు, ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

నందిపై పరాశరేశ్వరస్వామి చిద్విలాసం

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నంది వాహనంపై స్వామి అమ్మవార్లు అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలను, పరివార దేవతలకు అభిషేకాలు చేసి, నైవేద్య సమర్పణ చేశారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర్లకు సుగంధ, పరిమళ ద్రవ్యాలు, పంచామృతాలతో స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలను అందుకున్న ఉత్సవర్లు అలంకరించుకుని నంది వాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న దేవరులు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకుని పురవీధుల్లో విహరించారు. స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం గజవాహనం అధిష్టించి ఊరేగింపులో ఉత్సవమూర్తులు దర్శనం ఇవ్వనున్నారు. ఈనెల 12న శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో చంపకవల్లీ, పరాశరేశ్వరస్వామికి జరిగే ఆర్జిత కల్యాణోత్సవంలో రూ 500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చునని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.



నంది వాహనంపై పరాశరేశ్వరస్వామి, అమ్మవారు